ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి

జిల్లా వార్తలు

గురువారం 20 మార్చి 2025

మందుబాబులకు సామాజిక సేవా శిక్ష



ఆ ముగ్గురిని ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్‌బాబుకు అప్పగిస్తున్న సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మానాయుడు

సూళ్లూరుపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన ముగ్గురికి సూళ్లూరుపేట కోర్టు జరిమానాతో పాటు సామాజిక సేవా శిక్ష విధించింది. సూళ్లూరుపేట పట్టణ పరిసరాల్లోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. సూళ్లూరుపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు 2వ తరగతి అదనపు న్యాయమూర్తి సుబ్బారావు ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి కేసును విచారించి మందు బాబులు ఒక్కొక్కరికి రూ.200 చొప్పున జరిమానా విధించారు. అలాగే సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిలో మూడు గంటల పాటు సామాజిక సేవ చేయాలని ఆదేశించారు. దీంతో పోలీసులు మందుబాబులను ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్‌బాబుకు అప్పగించారు.

ఇసుక రవాణా అడ్డుకుంటావా?



అక్రమార్కులు వదిలేసి వెళ్లిన ట్రాక్టరు

- ఓ రైతు ఇంటిపైకి దాడికెళ్లిన అక్రమార్కులు

సూళ్లూరుపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చేసేది ఇసుక అక్రమ రవాణా. దీనిని అడ్డుకున్నారనే అక్కసుతో బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ఓ రైతు ఇంటిపైకెళ్లి దాడికి యత్నించారు. ఈ ఘటన సూళ్లూరుపేట మండలం మంగళంపాడులో చోటుచేసుకొంది. స్థానికుల సమాచారం మేరకు.. కాళంగి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలించేందుకు అక్రమార్కులు మంగళంపాడు పొలాల్లో దారి ఏర్పాటు చేసుకున్నారు. రాత్రి వేళ నది నుంచి ఇసుక తీసుకెళుతున్నారు. రెండు రోజుల కిందట కొందరు రైతులు 100కి కాల్‌చేసి ఫిర్యాదు చేశారు. ఆ రైతులపై పగబట్టిన అక్రమార్కులు బుధవారం రాత్రి 11 గంటల సమయంలో కొమరం నారాయణస్వామి ఇంటి పైకి నాలుగు వాహనాల్లో మనుషులను తీసుకెళ్లి రాళ్లు రువ్వారు. దాడికి యత్నించారు. ఇంతలో ఇరుగుపొరుగువారు అక్కడకు చేరుకోవడంతో రెండు ట్రాక్టర్లను వదిలేసి పరారయ్యారు. పోలీసులు గ్రామానికి చేరుకుని ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొన్నారు. దీనిపై సీఐ మురళీకృష్ణను వివరణ కోరగా.. పొలాల్లో ఇసుకను తరలించేందుకు దారివేయడంపై అడిగినందుకు రైతు నారాయణస్వామి ఇంటి పైకి దాడికి వచ్చారని బాధితులు చెప్పారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.



విచారణకు హాజరైన టీటీడీ అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది, విజిలెన్స్ అధికారులు



విచారణ అనంతరం బయటకు వస్తున్న కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి

భక్తులను పద్మావతి పార్కులోకి ఎందుకు పంపారు?

- తొక్కిసలాట సమయంలో మీరు ఎక్కడ ఉన్నారు?
- పూర్వ జేఈవో గౌతమిపై కమిషన్ ప్రశ్నల వర్షం
- న్యాయవాదులతో విచారణకు వచ్చిన పోలీసులు
- దాదాపు వంద మంది విచారణకు హాజరు



విచారణకు హాజరైన టీటీడీ పూర్వ జేఈవో గౌతమి.. నాటి ఎస్పీ సుబ్బరాయుడు, పూర్వ సీవీఎస్వో శ్రీధర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 19(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై టీటీడీ పూర్వ జేఈవో గౌతమిని ఏకసభ్య న్యాయవిచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి సుదీర్ఘంగా విచారించారు. బుధవారం ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ విచారణ సాగింది. 'వైకుంఠ ఏకాదశికి తిరుమలకు లక్షల్లో భక్తులు వస్తారు. టోకెన్ల కోసం పెద్దసంఖ్యలో వస్తారని తెలుసుకదా? మీరు తీసుకున్న యాక్షన్ ప్లాన్ ఏమిటి? టికెట్ల కేటాయింపునకు ప్రభుత్వ హైస్కూల్ కేటాయిస్తే.. భక్తులను పద్మావతి పార్కులోకి ఎందుకు పంపించారు? తొక్కిసలాట సమయంలో మీరెక్కడ ఉన్నారు? ఘటనా స్థలానికి ఎందుకు రాలేదు? పార్కు తాళాలు ఎవరు వేశారు?' ఇలా వివిధ అంశాలపై జస్టిస్ సత్యనారాయణమూర్తి ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. 'పెద్దసంఖ్యలో భక్తులు వస్తారని తిరుమల, తిరుపతిలోని పరిపాలన భవనంలో భక్తులకు టోకెన్ల కేటాయింపు విషయంపై పలుమార్లు సమీక్ష నిర్వహించాం. యాక్షన్ ప్లాన్‌నూ సిద్ధం చేశాం. బైరాగిపట్టెడ పార్కు నా పరిధిలోకి రాదు. సంఘటన జరిగినప్పుడు నేను జీవకోనలోని టోకెన్ల కేంద్రంలో ఉన్నాను. ఘటన జరిగిన వెంటనే స్విమ్స్‌కు వెళ్లా' అని గౌతమి చెప్పినట్లు సమాచారం. దీంతోపాటు సుమారు 5 పేజీల వరకు ఆమె కమిషన్‌కు వాంగ్మూలం ఇచ్చారు. తొక్కిసలాట ఘటనలో సస్పెండైన డీఎస్పీ రమణకుమార్ తరఫున న్యాయవాదులు కమిషన్ ఎదుట గౌతమిని క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. మరోవైపు తొక్కిసలాట ఘటనలో కీలకంగా మారిన 16మంది బాధితులను రెండోసారి విచారణకు పిలిచారు. ఓజిలికి చెందిన కృష్ణమ్మ, ఉమ్మడి చిత్తూరు జిల్లా రామసముద్రం మండలానికి చెందిన మరో ఇద్దరిని విచారించారు. పోలీసులు, టీటీడీ నిర్లక్ష్యంగా కారణంగా తాము తీవ్రంగా గాయపడ్డామని వారు కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. ఇక, మధ్యాహ్నం తర్వాత నలుగురిని మాత్రమే విచారించారు. కాగా, తొక్కిసలాట సమయంలో విధుల్లో ఉన్న అప్పటి ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, సస్పెండైన డీఎస్పీ రమణకుమార్, ఎస్వీ గోశాల మాజీ డైరెక్టర్ హరినాథరెడ్డితో పాటు డీఎస్పీ నుంచి కానిస్టేబుల్ స్థాయి వరకు జనవరి 8న పద్మావతి పార్కు వద్ద విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది, టీటీడీ విజిలెన్స్, ఉద్యోగులు సుమారు 90మందిని కూడా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో విచారణకు పిలిపించారు. సమయం లేకపోవడంతో గురువారం వీరంతా కమిషన్ ఎదుట హాజరు కానున్నారు. కాగా, విచారణ నేపథ్యంలో నాడు విధుల్లో ఉన్న టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, పలువురు డీఎస్పీలు, సీఐలు తమ వెంట లాయర్లను తెచ్చుకున్నారు. కమిషన్ ఎదుట ఎలా వాంగ్మూలం ఇవ్వాలనే దానిపై వారితో చర్చిస్తూ కనిపించారు. తొక్కిసలాట ఘటనపై తిరుపతి కలెక్టరేట్ వేదికగా మరో మూడు రోజుల పాటు విచారణ సాగనుంది.

మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

- తీర్మానంపై 16 మంది కౌన్సిలర్ల సంతకాలు
- వేడెక్కుతున్న వెంకటగిరి మున్సిపల్ రాజకీయం
- సొంతపార్టీలో కుంపటిని ఆర్పేపనిలో నేదురుమల్లి



అవిశ్వాస నోటీసును కలెక్టర్‌కు అందజేస్తున్న కౌన్సిలర్లు

వెంకటగిరి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి వైసీపీలో 'అవిశ్వాస' కుంపటి రాజుకుంది. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి దక్కించుకునేందుకు కౌన్సిలర్ దొంతు శారద శరవేగంగా పావులు కదుపుతున్నారు. ప్రస్తుత చైర్‌పర్సన్ నక్కా భానుప్రియపై అవిశ్వాసానికి సొంత పార్టీలోని కౌన్సిలర్ల మద్దతు కూడగట్టారు. 16 మంది కౌన్సిలర్లతో అవిశ్వాస తీర్మాన నోటీసులపై సంతకాలు చేయించి బుధవారం కలెక్టరు వెంకటేశ్వర్‌కు అందజేశారు. అవిశ్వాసం ప్రవేశ పెట్టడానికి సరిపడా కౌన్సిలర్ల మద్దతు కూడగట్టిన శారద.. ఆ తర్వాత సంపూర్ణ మద్దతు కూడగట్టే పనిలో ఉన్నారు. దీనికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, కూటమి నేతల మద్దతు ఆమెకు ఉన్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. గత మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ నుంచి కౌన్సిలరుగా గెలిచిన దొంతు శారద అప్పట్లో చైర్‌పర్సన్ పదవి ఆశించారు. అప్పటి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి 24వ వార్డు కౌన్సిల్ నక్కా భానుప్రియను ఎంపిక చేశారు. గడిచిన నాలుగేళ్లలో మున్సిపాలిటీలో పెద్దగా పనులు జరగకపోవడంతో సొంత పార్టీ కౌన్సిలర్లే చైర్‌పర్సన్‌ను వ్యతిరేకిస్తూ వచ్చారు. ఇక, చైర్‌పర్సన్ బావ నక్కా వెంకటేశ్వరావు పెత్తనంపై పలు సమావేశాల్లో సొంత పార్టీ కౌన్సిలర్లు నిలదీశారు. అయినా, అతడిలో మార్పులేకపోవడం.. చైర్‌పర్సన్ నక్కా భానుప్రియపై అసమ్మతి పెరిగేలా చేసింది. దీన్ని తమకు అనుకూలంగా శారద మార్చుకున్నారు. మరోవైపు ఈమెకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ప్రముఖ పారిశ్రామికవేత్త గంగాప్రసాద్ పరోక్ష సహకారం అందిస్తున్నట్లు తెలుస్తోంది. తిరుమలకు సీఎం చంద్రబాబు రానున్న నేపథ్యంలో వెంకటగిరి మున్సిపల్ రాజకీయాల గురించి టీడీపీ నేతలు చర్చించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇక, సొంత పార్టీలో రేగిన 'అవిశ్వాస చిచ్చు'ను ఆర్పే పనిలో నియోజకవర్గ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఉన్నట్లు సమాచారం. దీనికోసం ఆయన గురువారం వెంకటగిరి వస్తున్నట్లు వైసీపీ వర్గాలు తెలిపాయి.

మున్సిపాలిటీలో బలాబలాలిలా

వెంకటగిరి మున్సిపాల్టీలోని మొత్తం 25 వార్డుల్లో వైసీపీ కౌన్సిలర్లే ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు 5, 4, 7 వార్డుల కౌన్సిలర్లు టీడీపీ గూటికి చేరారు. మిగిలి 22 మంది కౌన్సిలర్లు వైసీపీలోనే కొనసాగుతూ వచ్చారు. ఈ నెల 17వ తేదికి పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు పూర్తి కావడంతో అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టే అవకాశం ఏర్పడింది. దీంతో బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి 16 మంది కౌన్సిలర్ల సంతకాలతో అవిశ్వాసంపై నోటీసులిచ్చారు. దీనిపై ఆయన సమావేశ తేదీని ఖరారు చేయాల్సి ఉంది.

శ్రీవారి సేవలో ప్రభుదేవా



సినీ దర్శకుడు, కొరియోగ్రాఫర్ ప్రభుదేవా బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సతీమణి హిమాని సింగ్, కుమార్తెతో కలిసి వీఐపీ బ్రేక్‌లో స్వామిసేవలో పాల్గొన్నారు. ఆలయం వెలుపల ఆయన్ను చూసేందుకు అభిమానులు పోటీ పడ్డారు. సెల్ఫీల కోసం ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

- పారా మిలటరీ బలగాలతో కూంబింగ్
- పోలీసుల అదుపులో 40 మంది అనుమానితులు

తిరుపతి(నేరవిభాగం)/తిరుమల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రేణిగుంట విమానాశ్రయంలో పారా మిలటరీ బలగాలు మోహరించాయి. తిరుమల, తిరుపతిలో అడుగడుగునా తనిఖీలు చేస్తున్నారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుమలకు వెళ్లే అన్ని మార్గాల్లోని కల్వర్టులు, బ్రిడ్జిలు, రోడ్లకు ఇరువైపులా బాంబు స్క్వాడ్లు తనిఖీలు చేస్తుండగా.. రోడ్డు డిగ్గింగ్ పార్టీలు అనుమానిత ప్రాంతాల్లో రోడ్లు తవ్వి పరిశీలిస్తున్నాయి. ఇక, గరుడ సర్కిల్ నుంచి తిరుమల ఘాట్ రోడ్లలో రిజర్వు బలగాలు తనిఖీలు చేస్తున్నాయి. ఎస్టీఎఫ్ బలగాలు శేషాచలం అడవుల్లో కూంబింగ్ చేపట్టాయి. తిరుపతి, తిరుమలలో తనిఖీలు చేసిన పోలీసులు ఇప్పటికే దాదాపు 40 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. అనంతపురం డీఐజీ షిమోషీ నేతృత్వంలో ఇద్దరు ఎస్పీల పర్యవేక్షణలో ముగ్గురు అదనపు ఎస్పీలు, 25 మంది డీఎస్పీలు, 56 మంది సీఐలు, 100 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లతో పాటు మరో 200 మంది పోలీసులు, రిజర్వు బలగాలు, డాగ్, బాంబు స్క్వాడ్‌లు, హోంగార్డులు, మహిళా పోలీసులు, ఎస్టీఎఫ్ బలగాలు సీఎం బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు. మరోవైపు విమానాశ్రయం నుంచి తిరుమల వరకు భద్రతా సిబ్బంది సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. సీఎం బస చేసే పద్మావతి అతిథిగృహం, కాన్వాయ్ ప్రయాణించే మార్గాలు, శ్రీవారి ఆలయం, అన్నప్రసాద భవనాల్లో ఇప్పటికే కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. తిరుమల పోలీసు, విజిలెన్స్ అధికారులతో కలిసి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శ్రీవారి ఆలయం, పరిసర ప్రాంతాలు, ఘాట్‌రోడ్లలో తనిఖీలు నిర్వహించి భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. సీఎం పర్యటన నేపథ్యంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అన్నప్రసాద భవనంలో తనిఖీలు నిర్వహించారు. కాగా, సీఎంతో పాటు మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి తిరుమలకు రానున్నారు.



శ్రీవారి ఆలయం ముందు భద్రతాంశాలపై చర్చిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, అధికారులు

ఆర్టీసీ బస్సెక్కి.. హంగామా చేసి!

- కండక్టర్ విధులకు ఆటంకం
- తిరుపతి మేయర్ సహా 25 మందిపై కేసు



ఆర్టీసీ బస్సులో వైసీపీ నేతలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సెక్కారు. మహిళలకు ఉచిత ప్రయాణమని చెప్పారంటూ టికెట్ తీసుకునేది లేదని వాదనకు దిగారు. కండక్టర్ విధులకు ఆటంకం కలిగించిన ఘటనలో తిరుపతి మేయర్ శిరీష సహా 25 మంది వైసీపీ నేతలపై బుధవారం కేసులు నమోదయ్యాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ నెరవేర్చాలంటూ తిరుపతిలో వైసీపీ నాయకులు నిరసన తెలిపారు. మేయర్ శిరీష, భూమన అభినయ్, టౌన్‌బ్యాంకు చైర్మన్ జయచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ సహదేవ యాదవ్, నగర పార్టీ అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలు గీత యాదవ్ తదితరులు ఆర్టీసీ బస్టాండు వద్ద పీలేరు వెళ్లే పల్లె వెలుగు బస్సు ఎక్కారు. బస్సు లీలామహల్ వద్దకు రాగానే కండక్టర్ టికెట్ అడిగారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని హామీ ఇచ్చారంటూ టికెట్ తీసుకునేది లేదన్నారు. టికెట్ ఇవ్వకుంటే దిగేయండని చెప్పారు. దీనిపై కాసేపు కండక్టర్ దామోదర్‌కు, వైసీపీ నాయకులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కండక్టర్ టికెట్లు కొట్టకుండా అడ్డుకోవడంతో డ్రైవర్ బస్సును ఆపేశారు. పీలేరు డిపో కండక్టర్ దామోదర్ ఫిర్యాదు మేరకు 25 మందిపై తిరుపతి ఈస్ట్ పోలీసులు కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. వీరిలో కొందరిని ఎస్వీయూ స్టేషన్‌కు.. మరికొందరిని ఈస్ట్ స్టేషన్‌కు తరలించారు. 41 నోటీసులు అందచేసి సొంత పూచీకత్తులపై విడుదల చేసినట్లు ఈస్ట్ సీఐ రామకృష్ణ చెప్పారు. ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించినా.. ముందస్తు అనుమతులు లేకుండా ధర్నాలు, ఆందోళనలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రకటన వచ్చే వరకు డ్రైవర్లు, కండక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని డీపీటీవో నరసింహులు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం ఆదేశించారు. బుధవారం వీరు 11 డిపోల మేనేజర్లతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ప్రయాణికుల కదలికలపై దృష్టిపెట్టాలని, వారివద్ద జెండాలు, బ్యానర్లు వంటివి ఉన్నాయా గమనించాలని, అనుమానం కలిగితే పై అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మార్గమధ్యలో ఎవరైనా ఆందోళన చేస్తే బస్సును నేరుగా సమీప పోలీస్‌స్టేషన్‌కు తరలించాలని సూచించారు.

నేడు సంస్కృత వర్సిటీ స్నాతకోత్సవం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ నాలుగో స్నాతకోత్సవం గురువారం జరగనుంది. మహతిలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో భారత మాజీ ఎన్నికల ప్రధానాధికారి, పద్మవిభూషణ్ గ్రహీత ఎన్.గోపాలస్వామి హాజరు కానున్నారు. పలువురికి బంగారు పతకాలు, స్నాతకోత్తర డిగ్రీలు, బిరుదులు, పట్టాలు ప్రదానం చేయనున్నారు. ఈ స్నాతకోత్సవంలో వర్సిటీ మాజీ చాన్స్‌లర్ డాక్టర్ వీఆర్ పంచముఖి ముఖ్య అతిథిగా పాల్గొంటారు. మొత్తం 564 మంది విద్యార్థులు స్నాతకోత్సవ పట్టాలు స్వీకరించనున్నారు. స్నాతకోత్సవానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి బుధవారం మీడియా సమావేశంలో తెలిపారు. కాలానుగుణంగా యూనివర్సిటీ అనేక మార్పులు చేర్పులు చేసిందన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:27 (గురువారం సాయంత్రం)

సహర్: 4:57 (శుక్రవారం ఉదయం)

ఏప్రిల్ 6 నుంచి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు



చంద్రగిరి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోదండ రామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 6 నుంచి 14వ తేది వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఏప్రిల్ 5నఅంకురార్పణతో వేడుకలు ప్రారంభం కానున్నాయి. 6న ధ్వజారోహణం జరుగుతుంది. 10న హనుమంత వాహనంపై స్వామివారు దర్శనం ఇవ్వనున్నారు. 12న కల్యాణోత్సవం, రాత్రి గరుడ వాహనసేవ ఉంటుంది. కల్యాణోత్సవంలో పాల్గొనదలచిన వారు రూ.750 చెల్లించాలి. 14న చక్రత్తాళ్వార్‌కు వసంతోత్సవం నిర్వహిస్తారు. ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న విరానిక

చంద్రగిరి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో సినీనటుడు, ఎంబీయూ ఛాన్సలర్ డాక్టర్ మోహన్‌బాబు జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. బుధవారం మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో నర్సింగ్ కళాశాలలో శిబిరాన్ని ఎంబీయూ ప్రొఛాన్సలర్ మంచు విష్ణు సతీమణి విరానిక ప్రారంభించారు. దాదాపు 500 మంది విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది రక్తదానం చేశారు. వంద మంది విద్యార్థులు అవయదాన సమ్మతికి నమోదుచేసుకున్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, ప్రోవోస్ట్ నాగరాజారామ్‌రావు, వీసీ కరుణాకరన్, నర్సింగ్. ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

పద్మావతిపురం అభివృద్ధికి ప్రతిపాదనలు



సమస్యలు తెలుసుకుంటున్న సుధారెడ్డి

తిరుచానూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పద్మావతిపురం గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి చెప్పారు. పద్మావతిపురంలో బుధవారం రాత్రి ఆమె మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీలో సమస్యలు గుర్తించామన్నారు. నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. స్థానిక సమస్యలను మహిళలు ప్రస్తావించారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన శ్రీవిద్య, పలువురు మహిళలు పాల్గొన్నారు. **పాకాల:** పంటపల్లె, పుదిపట్లబైలు పంచాయతీలలో మహిళలతో సుధారెడ్డి ముఖాముఖి నిర్వహించారు. పంచాయతీలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సహకారంతో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పద్మజరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బి.నాగరాజనాయుడు, నాయకులు కె.సావిత్రి, రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

అన్నప్రసాద భవనంలో తనిఖీలు



తిరుమల, మార్చి19 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు తిరుమల పర్యటన నేపథ్యంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి బుధవారం తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో తనిఖీలు నిర్వహించారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. అన్నప్రసాదాల నాణ్యత, రుచిపై భక్తులతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అన్నప్రసాదాలు రుచిగా ఉన్నాయని పలువురు భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట డిప్యూటీఈవో రాజేంద్ర, గార్డెన్ సూపరిటెండెంట్ శ్రీనివాసులు, డిప్యూటీ ఈఈ వేణుగోపాల్, వీజీవోలు రామ్‌కుమార్, సురేంద్ర, అన్నదానం క్యాటరింగ్ ఆఫీసర్ శాస్త్రి తదితర పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే భూ సర్వే నిర్వహించాలి



భూరీసర్వేను పరిశీలిస్తున్నఏడీ శ్రీనివాసులురెడ్డి, రెవెన్యూ అధికారులు

రావఁచంద్రాపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రైతుల సమక్షంలోనే భూ రీసర్వేను నిర్వహించాలని సెంట్రల్ సర్వే ఆఫీస్ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యంరెడ్డి చెప్పారు. బుధవారం సొరకాయలపాళెంలో భూ రీసర్వేను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రీసర్వేను నిష్పక్షపాతంగా, పకడ్బందీగా చేపట్టాలన్నారు. రైతులకు నోటీసులు అందజేశాక రీసర్వేను ప్రారంభించాలన్నారు. ప్రభుత్వ భూములు కూడా గుర్తించాలన్నారు. ఈ గ్రామంలో 372 ఎకరాలకుగాను 340 ఎకరాలు రీసర్వే పూర్తిచేశామని రీసర్వే డీటీ అమృత, మండల సర్వేయర్ రమేష్‌బాబులు ఆయనకు తెలిపారు. తహసీల్దారు వెంకటరమణ, డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు, వీఆర్వోలు నరసింహులు, ప్రదీప్‌నాయుడు, సచివాలయ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై విద్యార్థులతో ప్రతిజ్ఞ



సదస్సులో మాట్లాడుతున్న రమేష్‌కుమార్

పాకాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోకూడదని ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కుమార్ కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈగల్ కోఆర్డినేటర్లు డాక్టర్ మాశిలామణి, డాక్టర్ ఈశ్వరబాబు, అధ్యాపకులు మాధవి, రమణమ్మ, వినోద్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో రోగులకు భోజన వసతి

భాకరాపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు భోజన వసతిని ప్రభుత్వం కల్పించినట్లు మెడికల్ ఆఫీసర్ శ్రీధర్ తెలిపారు. బుధవారం చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుకు భోజన పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా భోజన వసతి కల్పించిందన్నారు. ఆసుపత్రిలోత్వరలో ఎక్స్‌రే సౌకర్యం కూడా అందుబాటులోకి వస్తుందన్నారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ, శివకుమార్, మదనమోహన్, విజయకుమారి, మనోహర, రూపేష్ రాయల్, ఎర్రయ్య నాయుడు, చంద్రశేఖర్, రమణ పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోండి



చట్టేవారిపాళెంలో ఆధార్ నమోదు

భాకరాపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పిల్లల ఆధార్ కార్డులలో మార్పులు-చేర్పులు చేసు కోవడానికి ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గిడ్డయ్య అన్నారు. చట్టేవారిపాళెం, రంగన్నగారిగడ్డ గ్రామ సచివాలయాలలో సోమవారం ఆధార్ ప్రత్యేక క్యాంపులు ప్రారంభించారు. ఆధార్ కార్డులలో మార్పులు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్లు శ్రీహరి, వికాస్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, మార్చి19(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. సోమవారం హుండీ ఆదాయం రూ.4.75 కోట్లు లభించింది. మంగళవారం 65,487మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా: 23,909 మంది తలనీలాలు సమర్పించారు.

యువకుడి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకొన్న మాధవన్

చంద్రగిరి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రెడ్డివీధిలో ఓయువకుడు ఆత్మహత్య చేసుకొన్నాడు. పోలీసుల కథనం మేరకు తొండవాడ సమీపంలోని హౌసింగ్ కాలనీకి చెందిన మాధవన్(24)పెయింట్ పనులు చేసేవాడు. ఇతనికి భార్య గౌరి, కుమార్తె ఉంది. కుటుంబ కలహాల నేపథ్యంలో మంగళవారం రాత్రి ఇంట్లో ఎవ్వరులేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు

భాకరాపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ నిర్వహించే ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో గిడ్డయ్య కోరారు. బీసీ, కమ్మ రెడ్డి, కాపు, ఆర్యవైశ్య, ఈబీసీ, బ్రాహ్మణ, క్షత్రియ కులాలకు చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ నెల 22లోపు గ్రామ సచివాలయాల నుంచి గానీ ఇంటర్నెట్ కేంద్రాల ద్వారా గానీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18 నుంచి 50 సంవత్సరాలలోపు మహిళలు అర్హులన్నారు. శిక్షణ పూర్తయ్యాక అర్హులకు ఉచితంగా కుట్టు మిషన్లను అందజేస్తారన్నారు.

గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చెంగయ్య



చంద్రగిరి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పెరుమాళ్ళపల్లి పంచాయతీ ఎస్వీ నగర్‌కు చెందిన తుమ్మల చెంగయ్య నియమితులయ్యారు. బుధవారం ఈమేరకు ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సేవలను గుర్తించి నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే పులివర్తి నాని, రూరల్ మండలం టీడీపీ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మరక్షణపై విద్యార్థినులకు అవగాహన



చంద్రగిరి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 360 మంది విద్యార్థినులకు బుధవారం డీఈఓ కుమార్ ఆధ్వర్యంలో శక్తి టీమ్ అవగాహన కల్పించారు. కరాటే మాస్టర్ ముస్తఫా విద్యార్థునులకు ఆత్మరక్షణ మెలకువలను నేర్పించారు. శక్తి టీమ్ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థునులకు మార్షల్ ఆర్ట్స్ రక్షణ కవచంగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ గిరిజ, హెడ్ కానిస్టేబుల్ శాంతి, హెచ్‌ఎం వెంకటరమణ, ఉపాధ్యాయురాలు ప్రసన్న కుమారి, హిమబిందు, మోహన్‌కుమారి, సాయిశ్రీ, పూర్ణచంద్ర, విద్యార్థునులు పాల్గొన్నారు.

గొల్లపల్లెలో రీసర్వేను తనిఖీ చేసిన అడిషనల్ డైరెక్టర్ గోవిందరావు

తిరుపతిరూరల్, మార్చి19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సి.గొల్లపల్లె గ్రామంలో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన రీసర్వేను బుధవారం ఏపీ సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ అడిషనల్ డైరెక్టర్ ఆర్.గోవిందరావు తనిఖీ చేశారు. సర్వే జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. కొన్ని రికార్డులను పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. డీఎస్ఎల్‌వో అరుణ్‌కుమార్, మండల సర్వేయర్ హేమకుమార్, రీ సర్వే డీటీ మోహన్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎరువుల అక్రమ రవాణాపై నిఘా

● అగ్రి డైరెక్టర్

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రసాయన ఎరువులు పక్కదారి పట్టకుండా నిరంతర నిఘా ఉంచాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు, రైల్వే వ్యాగన్ రేక్ పాయింట్ అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వచ్చే ఖరీఫ్ అవసరాల కోసం ఎరువులను బఫర్ స్టాక్‌ను 2లక్షల టన్నులకు పెంచనున్నట్లు చెప్పారు. ఎరువుల రవాణాలో ఖర్చులు అధికంగా ఉంటున్న విశాఖపట్నం, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాలకు మూడు రైల్వే వ్యాగన్ రేక్ పాయింట్లు ఏర్పాటు చేయాలని కేంద్రానికి సీఎం చంద్రబాబు ప్రతిపాదనలు పంపారన్నారు. ఎరువులు సమృద్ధిగా వస్తున్నా.. కృత్రిమ కొరత, అధిక ధరలకు విక్రయం, అక్రమ తయారీ, రవాణా, వ్యవసాయేతర అవసరాలకు వినియోగాన్ని నియంత్రించాలని అధికారులను ఆదేశించారు.

జన సంచారానికి దూరంగా గ్యాస్ ప్లాంట్

● రూ.8 కోట్లతో ఏర్పాటుకు టీటీడీ ప్రణాళిక

● సానుకూలంగా స్పందించిన ఐఓసీఎల్



తిరుమలలో ప్రస్తుతమున్న గ్యాస్‌ప్లాంట్ ప్రదేశం

తిరుమల, మార్చి19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తుల శ్రేయస్సు దృష్ట్యా గ్యాస్ ప్లాంట్‌ను దూరంగా ఏర్పాటు చేయాలని టీటీడీ నిర్ణయించింది. రూ.8 కోట్ల వ్యయంతో గోగర్భం సమీపాన ప్లాంట్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసింది. అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదాల తయారీకి ఐవోసీఎల్ కొన్నేళ్ల క్రితం తిరుమలలోని టీటీడీ ఉద్యానవనం పక్కనే గ్యాస్ స్టోరేజి ప్లాంట్‌ను నిర్మించింది. 30 టన్నుల నిల్వ సామర్థ్యమున్న ఈప్లాంట్ నుంచి పైపుల ద్వారా వంటశాలలకు రోజూ ఆరు టన్నుల గ్యాస్‌ను వంటశాలల్లో వినియోగిస్తున్నారు. ప్లాంట్ ఏర్పాటు చేసినప్పుడు ఆ ప్రాంతంలో జనసంచారం తక్కువగా ఉండేది. ప్రస్తుతం నందకం, వకుళామాత భారీ విశ్రాంతి భవనాలతో పాటు తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం కూడా అందుబాటులోకి రావడంతో జనసంచారం పెరిగింది. ఈక్రమంలోనే మరో ప్రాంతానికి తరలించాలని టీటీడీ చేసిన కసరత్తు కొలిక్కి వస్తోంది.

గోగర్భం డ్యాం వద్ద స్థలం ఎంపిక

గ్యాస్ ప్లాంట్ మార్పిడికి టీటీటీ చేసిన ప్రతిపాదనకు ఐఓసీఎల్ నుంచి సానుకూల స్పందన లభించింది. ప్లాంట్ ఏర్పాటుకు గోగర్భం డ్యాం వద్ద ఓ స్థలాన్ని టీటీడీ ఎంపిక చేసింది. దాదాపు 45 టన్నుల గ్యాస్ నిల్వ సామర్థ్యంతో ప్లాంట్ ఏర్పాటుకు ఐఓసీఎల్ అంగీకరించినట్టు తెలిసింది. ఇందుకయ్యే దాదాపు రూ.8 కోట్ల వ్యయాన్ని కూడా ఆ సంస్థ భరించనుంది. దీనిపై రెండు మూడురోజుల్లో ఎంఓయూ కుదరనుంది. ప్రాజెక్ట్ గురించి టీటీడీ అధికారులతో ఐఓసీఎల్ మార్కెటింగ్ డైరెక్టర్ సతీస్‌కుమార్ బృందం ఇటీవల టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరితో చర్చించింది. ఇప్పటికే ఐఓసీఎల్ తిరుమలలో రూ.7.5 కోట్లతో బయోగ్యాస్ ప్లాంట్‌ను కూడా నిర్మించేందుకు ముందుకు వచ్చిన విషయం తెలిసిందే.

ప్రపంచ శ్రేణి విశ్వవిద్యాలయాలకు దీటుగా ఎంబీయూ

● సహస్రవధాని మాడుగుల నాగఫణిశర్మ



మహాభారత్ సీరియల్ నటులకు సన్మానం

చంద్రగిరి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రపంచ శ్రేణి విశ్వవిద్యాలయాలకు దీటుగా మోహన్ బాబు యూనివర్శిటీని ఏర్పాటు చేశారని సహస్రవధాని మాడుగుల నాగఫణిశర్మ అన్నారు. ఎ.రంగంపేట సమీపంలోని మోహన్ బాబు విశ్వవిద్యాలయం వార్షికోత్సవం, సినీనటుడు, వర్సిటీ ఛాన్సలర్ మోహన్‌బాబు జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నాగఫణిశర్మ మాట్లాడుతూ విద్యాలయం నుంచి విశ్వవిద్యాలయంగా మారడం ఆదర్శనీయమన్నారు. సినీ పరిశ్రమలో ప్రత్యేక ముద్ర వేసుకోవడంతో పాటు విద్యాసంస్థ ద్వారా విశిష్ట సేవలందిస్తున్నారని కొనియాడారు. భక్త కన్నప్ప సినిమాను విష్ణు, మోహన్‌బాబులు చేయడం అదృష్టమన్నారు. భారత్ శాండిల్ వుడ్ సొసైటీ చైర్మెన్ శిరిగిరి రవీంద్ర మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రెండు శ్రీగంధం చెట్లను నాటాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వర రావు మాట్లాడుతూ మోహన్ బాబు విశ్వవిద్యాలయాన్ని యజ్ఞంలా తీర్చిదిద్దారన్నారు. సినీనటుడు శరత్‌కుమార్ మాట్లాడుతూ దేశంలోని అత్యుత్తమ యూనివర్శిటీగా ఎంబీయూ నిలుస్తుందన్నారు. కలల సాఫల్యానికి శ్రమించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా విశ్వవిద్యాలయంలో, శ్రీవిద్యానికేతన్ విద్యా సంస్థలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. మహాభారత్ సీరియల్ నటులను, చిత్ర కళాకారులను, భక్త కన్నప్ప నటులను, చిత్రకళాకారులను సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు హోరెత్తించాయి. కొరియోగ్రాఫర్ ప్రభుదేవా, మోహన్‌బాబుల డ్యాన్స్ అలరించింది.



వేదికపై నటుడు శరత్‌కుమార్‌తో మోహన్‌బాబు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

మోసాలకు పాల్పడితే లైసెన్స్ రద్దు

● ఆ పెట్రోల్ బంకులను ఏమాత్రం ఉపేక్షించొద్దు

● నామమాత్రపు జరిమానాలతో సరిపెడుతున్నారు

● యాజమాన్యాలపై కఠినంగా వ్యవహరించాల్సిందే ..

● ఇంధన కంపెనీలకు హైకోర్టు . ధర్మాసనం స్పష్టీకరణ

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో జరుగుతున్న మోసాలపై హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కిరోసిన్ కలపడం, ఇంధనం తక్కువ పోయడం వంటి చర్యలతో వినియోగదారులను మోసగిస్తున్న రిటైలర్లపై కఠినంగా వ్యవహరించాల్సిందేనని తేల్చిచెప్పింది. పెట్రోల్ తక్కువ ధరకేమీ ఇవ్వడం లేదని, ప్రతీ లీటర్‌కు రూ.100కు పైగా వసూలు చేస్తున్నారని గుర్తుచేసింది. వినియోగదారుల జేబులకు చిల్లుపెడుతున్న పెట్రోల్ బంకు యాజమాన్యాలకు నామమాత్రపు జరిమానాలు విధిస్తూ సరిపెడుతున్నారని, వారిని ఏమాత్రం ఉపేక్షించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. మోసాలకు పాల్పడుతూ పట్టుబడిన రిటైలర్ల లైసెన్స్‌లు వెంటనే రద్దు చేయాలని తేల్చిచెప్పింది. వైఎస్ఆర్ కడప, తిరుపతి జిల్లాల్లో రెండు పెట్రోల్ బంకుల మోసాలకు సంబంధించి హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వాస్తవాలు చెప్పకుండా దాచిపెట్టడంపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. అన్ని వివరాలతో సమగ్రంగా అఫిడవిట్ దాఖలు చేయాలని హెచ్‌పీసీఎల్‌ను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. కడప, అరవింద్‌నగర్, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న తేజ ఫిల్లింగ్ స్టేషన్, తిరుపతి- రేణిగుంట రోడ్డులోని శెట్టిపల్లి వద్ద ఉన్న తేజ సర్వీస్ స్టేషన్ మోసాలకు పాల్పడుతున్నా హెచ్‌పీసీఎల్ ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని పేర్కొంటూ కడప జిల్లా ఖాజీపేట గ్రామానికి చెందిన వెంకట మహేశ్వర్‌రెడ్డి 2024లో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిల్ బుధవారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది మేడపాటి సంతోష్‌రెడ్డి వాదనలు వినిపించారు. హెచ్‌పీసీఎల్ వేసిన కౌంటర్‌లో పెట్రోల్ బంకులపై ఉన్న ఆరోపణలు, వాటిపై ఉన్న కేసులు, తీసుకున్న చర్యల గురించి పూర్తి వివరాలు ప్రస్తావించలేదని కోర్టుకు విన్నవించారు. హెచ్‌పీసీఎల్ తరఫు న్యాయవాది వీఆర్ రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపిస్తూ.. చట్ట నిబంధనలకు అనుగుణంగా పెట్రోల్ బంకులపై చర్యలు తీసుకున్నామని, రూ.70వేల జరిమానా విధించామని చెప్పారు. ఈ వివరణను ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించింది.రిటైలర్లతో ఇంధన కంపెనీలు కుమ్మక్కయినట్లు కనపడుతోందని వ్యాఖ్యానించింది.పెట్రోల్ బంకుల యాజమాన్యాలకు నామమాత్రపు జరిమానాలు విధించి చేతులు దులుపుకోవడం సరికాదని పేర్కొంది. వారి లైసెన్స్‌లు రద్దు చేయాలని స్పష్టం చేసింది. సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని హెచ్‌పీసీఎల్‌ను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

మహిళలను క్యాన్సర్ నుంచి రక్షించాలి



రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ యంత్రాన్ని ప్రారంభిస్తున్న డీఎంఈ డీఎస్‌వీఎల్ నరసింహం

తిరుపతి(వైద్యం), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత జీవనశైలిలో మహిళలు ఎక్కువగా రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారని, దాని నుంచి రక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని డీఎంఈ(డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం అన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రసూతి, రుయాస్పత్రులను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రసూతి ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ యంత్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్‌ను మొదట్లోనే గుర్తించకపోతే ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందన్నారు. వైద్య సిబ్బంది మహిళలకు క్యాన్సర్, దాని లక్షణాలు, వైద్య పద్ధతులపై అవగాహన కల్పించాలన్నారు. దీనికిముందు ఆయన రుయాస్పత్రిలో వైద్యాధికారులతో సమీక్షించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, ఆస్పత్రి అవసరాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, అడ్మినిస్ట్రేటర్ కనకనరసారెడ్డి, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రవిప్రభు, పార్థసారథిరెడ్డి, సీఎస్ఆర్‌ఎంవో సుబ్బలక్ష్మమ్మ, డీసీఎస్ ఆర్‌ఎంవో శ్రీనివాస్, ఏఆర్‌ఎంవో హరికృష్ణ, వైద్య విభాగాధిపతులు మనోహర్, ప్రమీల పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయండి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటకులు అత్యధికంగా సందర్శించే ప్రాంతాలను టూరిజం, అటవీ శాఖ సమన్వయంతో అభివృద్ధి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. ఎర్రచందనం మొక్కలకు జియో ట్యాగింగ్ చేపట్టాలన్నారు. పర్యాటక రంగం అభివృద్ధిపై కలెక్టరేట్‌లో అటవీ శాఖ, ఇతర అధికారులతో ఆయన సమీక్షించారు. ఆర్గానిక్ ఉత్పత్తులు, ఏకో టూరిజం, వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్ కింద ఎర్రచందనం, దాని ఉత్పత్తులపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. చేతివృత్తులు, హస్త కళాకారులకు జీవనోపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఎఫ్‌వో వివేక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 26,413 మంది హాజరు

తిరుపతి(విద్య), మార్చి 19(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలకు 26,413 మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈవో కేవీఎన్ కుమార్ వెల్లడించారు. బుధవారం జరిగిన హిందీ పరీక్షకు 26,660 మంది రెగ్యులర్ విద్యార్థులు, 25 మంది ప్రైవేటు విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా రెగ్యులర్ 26,402మంది, ప్రైవేటు 11మంది మొత్తం 26,413 మంది రాశారని వివరించారు. 272 మంది గైర్హాజరయ్యారని, జిల్లాలో ఎక్కడా ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ చోటుచేసుకోలేదని తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



ఆలయం ముందు సతీష్‌కుమార్

తిరుమల, మార్చి19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) మార్కెటింగ్ డైరెక్టర్ సతీష్‌కుమార్, ఏజీఎస్ ఎంటర్టైన్మెంట్ సీఈవో అర్చన కల్పతి దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన వారు ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.

25న వెంకటేశ్వరస్వామి కల్యాణం

వడమాలపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 25న కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి శివకుమార్ తెలిపారు. ప్రతి నెలా శ్రవణా నక్షత్రం రోజున స్వామి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొనదలచిన భక్తులు రూ.300 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

టీటీడీ నిధులతో 'తుడా'లో పారిశుధ్య పనులా?

● దీనిపై మీ వైఖరి ఏమిటో చెప్పండి ● రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ, తుడాకు హైకోర్టు ఆదేశం

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): టీటీడీ నిధులను ధార్మిక కార్యక్రమాలకు కాకుండా ఇతర అవసరాలకు వినియోగించడాన్ని హైకోర్టు మరోసారి ఆక్షేపించింది. తమిళనాడు నుంచి భక్తులు వస్తున్నారనే పేరుతో ఆ రాష్ట్రం నుంచి తిరుమలకు రోడ్ల విస్తరణ, మరమ్మతులను టీటీడీ నిధులతో చేపడతారా అని ప్రశ్నించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ నిధులను తిరుపతి కార్పొరేషన్‌లోని రోడ్లు, కాలనీల పారిశుధ్య పనులకు వినియోగించడాన్ని అనుమతిస్తూ ఇచ్చిన ఉత్తర్వులపై వైఖరి తెలపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, టీటీడీని, తుడాను ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. తిరుపతి కార్పొరేషన్‌లోని రోడ్లు, కాలనీల పారిశుధ్య పనులకు ప్రతీ ఏడాది రూ.100 కోట్లు టీటీడీ నిధులను వినియోగించడాన్ని సవాల్ చేస్తూ బీజేపీ నేత జి.భానుప్రకాశ్ రెడ్డి 2023లో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిల్‌పై గతంలో విచారణ జరిపిన ధర్మాసనం... ఈవో నిర్ణయం దేవదాయ చట్టానికి విరుద్ధమని ప్రకటించింది. టెండర్ ప్రక్రియను నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ పిల్ బుధవారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది రేగులగడ్డ వెంకటేశ్ వాదనలు వినిపించారు. భక్తులు ఇచ్చే కానుకలను, నిధులను భక్తుల సంక్షేమం, హిందూ ధర్మం కోసమే వినియోగించాలని, ఇతర అవసరాలకు మళ్లించడానికి వీల్లేదని పేర్కొన్నారు. టీటీడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... ఈ వ్యవహారంపై టీటీడీ కొత్త బోర్డు నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ప్రణతి స్పందిస్తూ.... తిరుపతి కార్పొరేషన్ పరిధిలో తిరుమలకు దారితీసే రోడ్ల మరమ్మతులు, పారిశుధ్య పనుల నిర్వహణ కోసమే నిధులు వినియోగిస్తున్నారని తెలిపారు. ఈ వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం.. దీనిపై వైఖరి తెలపాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

గంగమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.22.75 లక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.22,75,865 వచ్చింది. డీఈవో వినోద్‌కుమార్ పర్యవేక్షణలో బుధవారం చేపట్టిన హుండీ లెక్కింపులో 22,75,865 నగదుతో పాటు 24 గ్రాముల బంగారు, 720గ్రాముల వెండి వచ్చినట్లు ఈవో జయకుమార్ తెలిపారు.78రోజులకు ఈ ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. సప్త గిరి గ్రామీణ బ్యాంకు, ఈస్ట్ పోలీసు సిబ్బంది, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ముగిసిన దక్షిణాది వేద సమ్మేళనం


ముగింపు సభలో వీసీ రాణిసదాశివమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం వేదికగా చేపట్టిన దక్షిణాది రాష్ట్రాల వేద సమ్మేళనం ముగిసింది. ముగింపు సభలో వేద వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణిసదాశివమూర్తి ప్రతినిధులను సత్కరించారు. వేద విద్య బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో వేద వర్సిటీ అంకితభావంతో కృషి చేస్తోందన్నారు. టీటీడీ, ప్రభుత్వ సహకారంతో వేద పరిరక్షణకు వేద వర్సిటీ కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంచి వర్సిటీ వీసీ శ్రీనివాసశర్మ, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, ఉజ్జయిని వేద విజ్ఞాన పీఠం కార్యదర్శి విరుపాక్ష జడ్డిపాల్, రిజిస్ట్రార్ భాస్కరుడు, ప్రోగ్రాం డైరెక్టర్ తారకరామకుమారశర్మ, 100 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

నిషేధిత హారన్ల తొలగింపు


ఆటోలకు ఉన్న నిషేధిత హారన్లను తొలగిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆటోలు, జీపులు, కార్లకు అమర్చిన నిషేధిత హారన్లను పోలీసులు తొలగించారు. నిషేధిత హారన్ల మోతతో నగర వాసులను, యాత్రికులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో ఎస్పీ హర్షవర్ధన రాజు దృష్టి సారించారు. ఈ క్రమంలో బుధవారం ట్రాఫిక్ పోలీసులు బృందాలుగా విడిపోయి గరుడ సర్కిల్, అన్నమయ్య సర్కిల్, టౌన్‌క్లబ్, సెంట్రల్ పార్కు, పూర్ణకుంభం సర్కిల్, రైల్వే స్టేషన్ వంటి ప్రాంతాల్లో తనిఖీలు చేసి, దాదాపు 100 ఆటోలకు అమర్చిన నిషేధిత హారన్లను తొలగించారు. డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నిషేధిత హారన్లు ఏర్పాటు చేసుకుని ఉంటే స్వచ్ఛందంగా తొలగించాలని, లేకపోతే కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

గేట్‌లో మెరిసిన ఎస్వీయూ ఫిజిక్స్ విద్యార్థిని


విద్యార్థిని కీర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్)లో ఎస్వీ యూనివర్సిటీ ఎమ్మెస్సీ ఫిజిక్స్ విద్యార్థిని బి.కీర్తి మెరిసింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఈమె ఈ పరీక్షల్లో జాతీయ స్థాయిలో 78వ ర్యాంకును కైవసం చేసుకుంది. తద్వారా జాతీయ స్థాయి యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ చేసే అవకాశాన్ని పొందింది. సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ టీవీఎస్ రెడ్డి, ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ దేవప్రసాదరాజు ఆమెను అభినందించారు.

నేడు పద్మావతి వర్సిటీలో జాతీయ సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీ ఇంగ్లిషు విభాగం రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించనుంది. సామాజిక పరివర్తనలో ఇటీవల ధోరణులు అంశంపై పీఎం-ఉష నిధులతో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు సావేరీ హాల్లో ప్రారంభం కానుంది. ప్రఖ్యాత విమర్శకులు ప్రొఫెసర్ బి.తిరుపతి రావు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ మధురాంతకం నరేంద్ర, పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ, ఇన్‌చార్జి డీన్ ప్రొఫెసర్ విజయలక్ష్మి పాల్గొంటారని ప్రోగ్రాం కో-ఆర్డినేటర్స్ ప్రొఫెసర్ వి.నిర్మల, ప్రొఫెసర్ వై.ఎస్.శారద తెలిపారు.

తిరుపతి

నేడు దేవదాయ శాఖ మంత్రి రాక

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గురువారం జిల్లాకు రానున్నారు. సాయంత్రం గన్నవరం నుంచి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి తిరుమల వెళ్లి రాత్రి బస చేస్తారు. శుక్రవారం స్వామివారిని దర్శించుకుని, సీఎం చంద్రబాబు పర్యటనలో పాల్గొంటారు.

12న వీర హనుమాన్ విజయయాత్ర

తిరుపతి (జీవకోన), మార్చి 19(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 12న వీర హనుమాన్ విజయయాత్ర, బైక్ ర్యాలీ నిర్వహించనున్నామని బజరంగదళ్ నాయకులు విష్ణు కీర్తిరెడ్డి, డాక్టర్ సుధాకర్‌బాబు తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ శోభాయాత్ర శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమై నంది సర్కిల్ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

23న మాలల సింహగర్జన సభ



తిరుపతి అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ మైదానంలో ఈనెల 23న ఆత్మగౌరవ పరిరక్షణకోసం మాలల సింహగర్జన సభ నిర్వహిస్తున్నట్లు రాయలసీమ మాలల జేఏసీ గౌరవాధ్యక్షుడు చెరుకూరి అశోకరత్నం తెలిపారు. బాలాజీకాలనీలోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రిజర్వేషన్లను రద్దు చేయాలనే కుట్రతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను తెరపైకి తెచ్చాయన్నారు. 2011 జనాభాను ప్రాతిపదికగా మాలలను తక్కువగా చూపిస్తూ మాదిగలకు ఉపకరించేలా వర్గీకరణ ఆమోదానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. వన్‌మ్యాన్ కమిషన్ నివేదికను అడ్డుపెట్టుకొని అసెంబ్లీలో వర్గీకరణకు ఆమోదించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ క్రమంలో యావత్‌మాల జాతి సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా తిరుపతిలో మాలలసింహగర్జన సభ చేపడుతున్నట్లు తెలిపారు. సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. జేఏసీ ప్రతినిధులు మల్లారపు మధు, సుదర్శనం, అజయ్‌కుమార్, ధనశేఖర్, మురళి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి అగ్రి వర్సిటీలో ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల రైతులకు నికరాదాయం లభించేలా సాంకేతిక పరిజ్ఞానంపై ఈ నెల 27, 28, 29 తేదీల్లో గుంటూరు జిల్లా లాంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన, సదస్సు జరుగుతుందని వర్సిటీ వీసీ శారదా జయలక్ష్మి తెలిపారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, లక్షద్వీప్, అండమాన్ రాష్ట్రాలకు ఉపయోగపడే ఈ సదస్సులో సాంకేతిక పరికరాల ప్రదర్శనకు 300 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్టు బుధవారం చెప్పారు. కాగా పత్తి సాగు, పరిశోధనలు, భవిష్యత్ వ్యూహాలను చర్చించేందుకు ఈ నెల 21 నుంచి 23 వరకు లాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో జాతీయ స్థాయి సమావేశం జరుగుతుందని లాం ఫాం అసోసియేట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు.

టీడీపీ నగర సభ్యత్వం 47,300


సభ్యత్వ నమోదు కార్డులు అందజేస్తున్న సుగుణమ్మ

తిరుపతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో 47,300 మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారని, అదే మన బలమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ అన్నారు. టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమం బుధవారం ఆమె నివాసంలో జరిగింది. సుగుణమ్మ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కోటికి పైగా సభ్యత్వం ఉండడం గర్వకారణమన్నారు. సభ్యత్వం పొందిన వారికి రూ.5 లక్షలు బీమా ఉందని చెప్పారు. చంద్రబాబు పాలనపై ప్రజలకు నమ్మకం, లోకేశ్ యువశక్తిపై విశ్వాసంతో లక్ష మంది సభ్యత్వం నమోదు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రుద్రకోటి సదాశివం, శ్రీధర్ వర్మ, కుమారమ్మ, చినబాబు, నూర సుధాకర్‌రెడ్డి, బుల్లెట్ రమణ, దంపూరి భాస్కర్ యాదవ్, విజయలక్ష్మి, బ్యాంక్ శాంతమ్మ, మన్నెం శ్రీనివాసులు, కరాటే చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న ఎక్స్‌కవేటర్, టిప్పర్ సీజ్

తిరుపతి(నేరవిభాగం), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని దేవలోక్ వద్ద మట్టి తరలిస్తున్న ఎక్స్‌కవేటర్, టిప్పర్‌ను పోలీసులు సీజ్ చేశారు. సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. పేరూరు పంచాయతీ దేవలోక్ వద్ద అనుమతులు లేకుండా మట్టి తోలుతున్నారని రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం వచ్చింది. సీఐ చిన్నగోవిందు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టి మట్టి తోడుతున్న ఎక్సకవేటర్, లోడవుతున్న టిప్పర్‌ను సీజ్ చేశారు. వాహనాల డ్రైవర్లు, కాంట్రాక్టర్ గిరిపైన కేసు నమోదు చేశారు.

మెగా కార్పొరేట్ క్రికెట్ విజేత పోలీస్ జట్టు



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(క్రీడలు), మార్చి 19(ఆంధ్రజ్యోతి): తారకరామ మైదానంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన మెగా కార్పొరేట్ క్రికెట్ టి20 లీగ్ తుది సమరంలో అమరరాజపై పోలీసు జట్టు ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పోలీసు జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన అమరరాజ జట్టు 9 వికెట్లు కోల్పోయి 155 పరుగులు మాత్రమే చేసి ఓటమి చవిచూసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ వెంకటేశ్వర్ విన్నర్, రన్నరప్ జట్లకు బహుమతులు, ట్రోఫీలను అందజేశారు. టోర్నీని విజయవంతం చేసిన చీఫ్ ఆర్గనైజర్ చీర్లకిరణ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ పి.సి.రాయలు పాల్గొని ఆటగాళ్లకు జ్ఞాపికలను అందజేశారు.

అయ్యా సామీ..! మమ్మల్ని పట్టించుకోండి

● కలెక్టరేట్‌లో మకాం వేసిన షికారీలు



తిరుపతి(కలెక్టరేట్), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): 'అయ్యా సామీ..! మేమేదో పూసలు కుట్టుకుని యాపారం చేస్తుంటాము... తెల్లార్తో వచ్చాం. మద్దానం 3 అయింది... మా సమస్యలు పట్టించుకోరా... మేం పోయి యాపారం ఎపుడు చేసుకునేది' అంటూ రేణిగుంటకు చెందిన షికారీలు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ వద్ద వాపోయారు. రేణిగుంటలో షికారీలు ఉన్న కాలనీని భూసేకరణలో భాగంగా రైల్వేకు కేటాయించారు. వీరికి మూడు నెలల అద్దెతో పాటు ప్రభుత్వం తూకివాకం వద్ద ఇంటి స్థలాలను మంజూరు చేసింది. తమకు అక్కడ మౌలిక వసతులతో పాటు ఇంకా పరిహారం ఇవ్వాలని 50 కుటుంబాల వారు కలెక్టరేట్‌లోని అధికారుల చాంబరు వద్ద నిరసన తెలిపారు. అక్కడే అన్నపానీయాలు కానిచ్చారు. అధికారులు రావడం ఆలస్యం కావడంతో పూసలు కుట్టుకుంటు కనిపించారు. చివరకు అధికారుల హామీతో వెనుదిరిగారు.

ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు

తిరుపతి, మార్చి19(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి జన్మదిన వేడుకలు తిరుపతిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త గుణకల మురళి, బాలకృష్ణారెడ్డి (యుకే) ఆధ్వర్యంలో గోవిందరాజ స్వామి ఆలయ సమీపంలో అన్నదానం చేశారు. తిరుచానూరు రోడ్డులో కేక్‌కట్ చేసి, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుణకల రమేష్ పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ స్కూటర్ స్టోర్ ప్రారంభం

తిరుపతి(ఉపాధ్యయనగర్), మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కొరమేనుగుంట రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రముఖ 'రివర్' ఎలక్ట్రిక్ స్కూటర్ స్టోర్‌ను బుధవారం బీజేపీ నేత, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, రోడ్డు రవాణాశాఖాధికారి మురళీమోహన్ ప్రారంభించారు. యూత్‌ను ఆకర్షించే విధంగా అధునాతనంగా తయారుచేసిన ఎలక్ట్రిక్ ఇండీ బైక్‌ను ఆవిష్కరించారు.

చర్లపల్లి-కన్నియకుమారి మధ్య 26 ప్రత్యేక రైళ్లు

తినుపతి(సెంట్రల్) మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని చర్లపల్లి-కన్నియకుమారి మధ్య 26 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. ఏప్రిల్ 2న చర్లపల్లిలో ఈ ప్రత్యేక రైలు(07230) రాత్రి 9.50 గంటలకు బయలుదేరి నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట, తిరుత్తణి, కాట్పాడి, తిరువణ్ణామలై, విల్లుపురం, తిరుప్పాదిరిపులియూర్, చిదంబరం, మైలాడుదురై, కుంభకోణం, తిరువారూర్, తిరుచ్చి, దిండిగల్లు, కొడైకెనాల్ రోడ్డు, మధురై, విరుదునగర్, సతూర్, కోవిల్‌పట్టి, తిరునల్వేలి, వల్లియూర్, నాగర్‌కోయిల్ మీదుగా కన్యాకుమారిలకు రెండవ రోజు రాత్రి 2.30 గంటలకు చేరుకుంటుంది. కన్యాకుమారిలో ఈ ప్రత్యేక రైలు(07229) ఏప్రిల్ 4న ఉదయం 5.15 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ మరుసటి రోజు ఉదయం 11.40 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుందని వెల్లడించారు. ఈ ప్రత్యేక రైళ్లు జూన్ 27వ తేదీ వరకు చర్లపల్లిలో ప్రతి బుధవారం, కన్యాకుమారిలో ప్రతి శుక్రవారం బయలుదేరి రాకపోకలు సాగిస్తాయని తెలిపారు.

జూన్ 30 వరకు ప్రత్యేక రైళ్ల పొడిగింపు

వేసవిని దృష్టిలో ఉంచుకుని ఆరు ప్రత్యేక రైళ్లను ఏప్రిల్ 4 నుంచి జూన్ 30వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. తిరుపతి-అకోల-పూర్ణ-వికారాబాద్‌ల మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్ల రాకపోకల కాలాన్ని పొడిగించామని పేర్కొన్నారు. తిరుపతి-అకోల(07605-07606), తిరుపతి-పూర్ణ (07610-07609), తిరుపతి-వికారాబాద్ (07481-07482) మధ్య రాకపోకలు సాగిస్తాయని వివరించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

కొనసాగిన వెటర్నరీ విద్యార్థుల సమ్మె


నిరసన వ్యక్తం చేస్తున్న వెటర్నరీ విద్యార్థులు

తిరుపతిరూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారమూ కొనసాగింది. వర్సిటీ ప్రధాన గేటు ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో విద్యార్థులు బైఠాయించి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థులు మాట్లాడుతూ.. వైద్య విద్య కోర్సుల తరహాలో వెటర్నరీ విద్య కూడా ఐదున్నరేళ్ల కాలవ్యవధితో నడుస్తుందని, అయితే వారికి నెలకు దాదాపు రూ.26 వేల స్టైఫండ్ అందిస్తూ తమపట్ల వివక్ష చూపుతున్నారని వాపోయారు. తమకు కూడా వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచేలా జీవో జారీ చేయాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 10 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 10 మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి, నాలుగవ అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. విచారించిన న్యాయమూర్తి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు. అలాగే రోడ్లపై పాదచారులు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్న 21 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రూ.500 వంతున అపరాధ రుసుం విధించారు.

డిపో మేనేజర్ తన వైఖరిని మార్చుకోవాలి


డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

గూడూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గూడూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని మార్చుకోవాలని ఎన్ఎంయూ నాయకులు అన్నారు. బుధవారం డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండోరోజు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గూడూరు నుంచి తిరుమల, బెంగళూరుకు బస్సులను నడపాలని కోరుతున్నా, ఇందుకు సంబంధించి నోట్‌ఫైల్‌ను ఇప్పటి వరకు డీఎం సిద్ధం చేయలేదన్నారు. అంతేకాకుండా ఉద్యోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కండక్టర్లు, డ్రైవర్ల డ్యూటీచార్ట్‌లను వెంటనే అమలు చేయాలని కోరారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించేవరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్, అహ్మద్, వెంకయ్య, వెంకటేశ్వర్లు, కృష్ణ, హస్సేన్, పోలయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతరకు తాంబూలం అందజేత


శ్రీనివాసులురెడ్డికి తాంబూలం అందజేస్తున్న ఈవో రవివర్మ

నాయుడుపేట టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ జాతరకు తాంబూలాన్ని అందజేశారు. బుధవారం ఉదయం దేవదాయశాఖ ఈవో రవివర్మ పట్టణ పరిధిలోని విన్నమాల గ్రామానికి వెళ్లి పెదకాపు శ్రీనివాసులురెడ్డికి తాంబూలాన్ని అందజేశారు. జాతర నిర్వహణకు పెద్దలు, గ్రామస్తులు సహకరించాలని ఈవో కోరారు. మార్చి 25వ తేదీ రాత్రి మొదటి చాటింపు, మే 4వ తేదీ ఘట్టం, మే 6వ తేదీ రాత్రి అమ్మవారి నిలుపు, మే 7వ తేదీ జాతర నిర్వహిస్తున్నట్లు ఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో నల్లబోతుల రామారావు, నానాబాల సుబ్బారావు, కుబేరు మణి, గుంటూరు లక్ష్మయ్య, ఆర్ఎస్ గిరి, రవీంద్ర, మహేష్‌రెడ్డి, చిట్టి, పూజారి సురేష్, ఇమిడిశెట్టి వెంకటేశ్వర్లు, బిరదవాడ నారాయణ, మల్లాం రవి, తదితరులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ'ను విజయవంతం చేయాలి


కరపత్రాలను విడుదల చేస్తున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

గూడూరు అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈనెల 27వ తేదీన నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. బుధవారం స్థానిక డిపో వద్ద పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు అనేక సమస్యలు దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి రావాల్సిన బెనిఫిట్స్ పూర్తిస్థాయిలో అందడంలేదన్నారు. కార్యక్రమంలో శేషయ్య, బీవీరమణయ్య, హరినాథ్, రత్నయ్య, రాజారామ్, జయచంద్ర, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు విద్యార్థినుల ఎంపిక


విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్ఎం మాధవీలక్ష్మి

గూడూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ కబడ్డీ పోటీలకు స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు మాధవీలక్ష్మి తెలిపారు. బుధవారం పాఠశాలలో కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ ఇటీవల నెల్లూరులో మాండలేస్ కంపెనీ సహకారంతో మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కబడ్డీ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన దీపిక, కౌసల్య, హర్షియా ప్రతిభచాటి జాతీయస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈనెల 21నుంచి 23వ తేదీ వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని బడ్డీ యూనివర్సిటీలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఫౌండేషన్ ప్రతినిధి లత తదితరులు పాల్గొన్నారు.

23న భగత్ సింగ్ వర్ధంతి సభ

వెంకటగిరి టౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధులు భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురులను ఉరితీసి 93 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 23న పట్టణంలో ర్యాలీ, సభ నిర్వహిస్తున్నామని పీడీఎస్‌వో పట్టణ నాయకుడు సీహెచ్ పవన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌వో నాయకులు లీలామోహన్, తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి అగ్రి వర్సిటీలో ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల రైతులకు నికరాదాయం లభించేలా సాంకేతిక పరిజ్ఞానంపై ఈ నెల 27, 28, 29 తేదీల్లో గుంటూరు జిల్లా లాంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన, సదస్సు జరుగుతుందని వర్సిటీ వీసీ శారదా జయలక్ష్మి తెలిపారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, లక్షద్వీప్, అండమాన్ రాష్ట్రాలకు ఉపయోగపడే ఈ సదస్సులో సాంకేతిక పరికరాల ప్రదర్శనకు 300 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కాగా, పత్తి సాగు, పరిశోధనలు, భవిష్యత్ వ్యూహాలను చర్చించేందుకు ఈ నెల 21 నుంచి 23 వరకు లాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో జాతీయ స్థాయి సమావేశం జరుగుతుందని లాం ఫాం అసోసియేట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు.

ఎరువుల అక్రమ రవాణాపై నిఘా: అగ్రి డైరెక్టర్

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రసాయన ఎరువులు పక్కదారి పట్టకుండా నిరంతర నిఘా ఉంచాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు, రైల్వే వ్యాగన్ రేక్ పాయింట్ అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వచ్చే ఖరీఫ్ అవసరాల కోసం ఎరువులను బఫర్ స్టాక్‌ను 2లక్షల టన్నులకు పెంచనున్నట్లు చెప్పారు. ఎరువుల రవాణాలో ఖర్చులు అధికంగా ఉంటున్న విశాఖపట్నం, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాలకు మూడు రైల్వే వ్యాగన్ రేక్ పాయింట్లు ఏర్పాటు చేయాలని కేంద్రానికి సీఎం చంద్రబాబు ప్రతిపాదనలు పంపారన్నారు. ఎరువులు సమృద్ధిగా వస్తున్నా.. కృత్రిమ కొరత, అధిక ధరలకు విక్రయం, అక్రమ తయారీ, రవాణాను నియంత్రించాలని అధికారులను ఆదేశించారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక సమయం మార్పు

గూడూరు అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమ సమయాన్ని మార్చినట్లు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా బుధవారం తెలిపారు. ఎండ తీవ్రత వల్ల సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు.

పంచాంగం ఆవిష్కరణ

గూడూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): శిరోమణిశర్మ రాసిన శ్రీవిశ్వావసు నామ సంవత్సర పంచాంగాన్ని బుధవారం స్థానిక బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అనిమెళ్ల శివకుమార్, శ్రీనివాసరావు, విద్యాలలిత, శ్రీనివాస్, నరసింహారావు, రామ్మూర్తి, సుబ్బారావు, ప్రకాశం పాల్గొన్నారు.


పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణసేవాసంఘ నాయకులు



కుదిరి - అట్టకానితిప్ప మధ్య రివిట్‌మెంట్ పనులు - అట్టకానితిప్ప అవతలి వైపు కొత్తగా నిర్మించిన రివిట్‌మెంట్

శ్రీహరికోట రోడ్డుకు రివిట్‌మెంట్

వరదల్లో కోతకు గురికాకుండా షార్ చర్యలు

సూళ్లూరుపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే రోడ్డుకు కుదిరి రెండో బ్రిడ్జి నుంచి షార్ ముఖద్వారం వరకు ఇరువైపులా రివిట్‌మెంట్ నిర్మిస్తున్నారు. కుదిరి నుంచి శ్రీహరికోటకు ముఖద్వారం వరకు పులికాట్ సరస్సు మధ్యలో రోడ్డు ఉంది. 2023 మిచౌంగ్, 2014లో ఫెంగల్ తుపాన్‌ల ప్రభావంతో వచ్చిన వరదల తాకిడికి శ్రీహరికోట రోడ్డు ఇరువైపులా దెబ్బతింది. వరదలతో పులికాట్‌కు భారీగా నీరుచేరి రోడ్డు మీద పొర్లాయి. దీంతో రోడ్డు అంచు కోతకు గురైంది. అప్పట్లో షార్ యాజమాన్యం స్పందించి రోడ్డు కోతకు గురికాకుండా ఇసుక బస్తాలు రక్షణగా వేశారు. ప్రస్తుతం వేసవి కావడంతో కుదిరి రెండో బ్రిడ్జి వద్ద నుంచి శ్రీహరికోట ముఖద్వారం వరకు రోడ్డుకు ఇరువైపులా రూ.50 లక్షలతో రివిట్‌మెంట్ నిర్మిస్తున్నారు. వరదల సమయాల్లో నీటి ఉధృత ఎక్కువైనా తట్టుకొనేలా రోడ్డుకు సమాంతరంగా ఎర్రగులక రాళ్లు పేర్చి సిమెంట్ వేస్తున్నారు. ప్రస్తుతం అట్టకానితిప్ప అవతలి వైపు శ్రీహరికోట ఎంట్రన్స్ వరకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర రెండువైపులా రివిట్‌మెంట్‌ను పూర్తి చేశారు. కుదిరి నుంచి అట్టకానితిప్ప వరకు రివిట్‌మెంట్ పనులను వేగంగా జరుగుతున్నాయి.

పట్టణంలో ప్రముఖుల విగ్రహాల ఏర్పాటు


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక

నాయుడుపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలో ప్రముఖుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కౌన్సిల్ నిర్ణయించింది. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో చైర్ పర్సన్ కటకం దీపిక ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జమా ఖర్చుల వివరాలు వెల్లడించారు. మున్సిపాలిటీ ముగింపు నిల్వ రూ.4,67,71,633 ఉండగా, సాధారణ, మూలధన జమ రూ.21,64,86,000గా పేర్కొన్నారు. మొత్తం ఆదాయం రూ.26,32,57,693 కాగా మూలధన ఖర్చులు రూ.21,26,51,000, ముగింపు నిల్వ రూ.5,06,06,693 గా చూపారు. అనంతరం చైర్ పర్సన్ కటకం దీపిక మాట్లాడుతూ పట్టణంలో మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగజ్జీవన్‌రామ్, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, మాజీ మంత్రి పసల పెంచలయ్య తదితరుల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించగా కౌన్సిలర్లందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ మున్సిపాలిటీకి సంబంధించి పోలేరమ్మ గుడి వద్ద, సీఎస్‌తేజ సెంటర్ వద్ద, ఆర్టీసీ ప్రాంతం వద్ద మున్సిపాలిటీకి విలువైన వాణిజ్య స్థలాలు ఉన్నాయని, ఆయా స్థలాల్లో లబ్ధిదారుల వాటాతో దుకాణాలు ఏర్పాటు చేస్తే ఆదాయం చేకూరుతుందన్నారు. అలాగే ఎన్‌జేఆర్ కాంప్లెక్స్ మిద్దెపైన దుకాణాలకు వేలం నిర్వహించి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, డీఈ శ్రీనివాసులు, ఏఈ చంద్ర, లక్ష్మి, రమేష్, గాయత్రి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో డీఈవో తనిఖీలు


ఎంఈవో కార్యాలయ సిబ్బందిని ప్రశ్నిస్తున్న డీఈవో కుమార్

కోట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కోటలోని బీసీ బాలురు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల పదో తరగతి పరీక్షా కేంద్రాలను బుధవారం డీఈవో కుమార్ తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించారు. బీసీ గురుకులంలో 6, 7 తరగతుల విద్యార్థులు బయట తిరుగుతుండటంతో వారిని గదుల్లోకి పంపారు. పరీక్షల సమయంలో ఇతర విద్యార్థులను ఎలా బయటకు పంపుతారని ప్రిన్సిపాల్, సిబ్బందిని ప్రశ్నించారు. పదో తరగతి పరీక్షలు పక్కందీగా నిర్వహిస్తున్నామని, ఎక్కడైన తేడాలు వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయాన్ని డీఈవో తనిఖీ చేశారు. కార్యాలయంలో వసతులు లేకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు.

పరీక్షా కేంద్రం వద్ద మురుగు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సూళ్లూరుపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం లోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం గేటు వద్ద మురుగునీటి నిల్వను మున్సిపాలిటీ అధికారులు ఎట్టకేలకు తొలగిం చారు. ఈ నెల 18న మంగళవారం ఆంధ్రజ్యోతిలో పరీక్షా కేంద్రం వద్ద మురుగు... దుర్గంధంతో విద్యార్థుల ఇక్కట్లు శీర్షికన వార్త రావ డంతో మున్సిపాలిటీ అధికారులు స్పందించారు. బుధవారం మున్సిపాలిటీ కమిషనర్ చిన్నయ్య చొరవ తీసుకొని పారిశుధ్య కార్మికుల సాయంతో కాలువలో పేరుకుపోయిన చెత్త చెదారాలను తొలగించారు. సమీపంలోని కాలువలో పూడికతీశారు. మురుగునీటిని పూర్తిగా బటయకు పంపి బ్లీచింగ్ వేశారు. అదేవిధంగా పట్టణంలో పలుచోట్ల కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలిగించి మురుగు నిల్వలేకుండా చర్యలు తీసుకొంటున్నట్లు కమిషనర్ తెలిపారు.

పారదర్శకంగా రీసర్వే


అల్లంపాడులో భూములను పరిశీలిస్తున్న తహసీల్దారు జయజయరావు

కోట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అల్లంపాడు పంచాయతీలో భూముల రీసర్వే పారదర్శకంగా చేపట్టాలని, ఎక్కడైన లోపాలు జరిగితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దారు జయజయరావు హెచ్చరించారు. బుధవారం రీసర్వే జరుగుతున్న తీరును, భూములకు సంబంధించిన రికార్డులను తహసీల్దారు పరిశీలించారు. ప్రభుత్వ, పట్టా భూములపై ఆరా తీశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గోపిరెడ్డి, వీఆర్వో కృష్ణయ్య, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోండి

పెళ్లకూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో అసంపూర్తిగా ఉన్న 164 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులను హౌసింగ్ ఏఈ వెంకయ్య కోరారు. బుధవారం చిల్లకూరు సచివాలయంలో ఆయన మాట్లా డుతూ పీఎంఏవై, పీఎం జన్‌మన్ పథకంలో మంజూరై నిర్మాణం పూర్తి కాకుండా ఆగిపోయిన ఎస్సీ, ఎస్టీ, బీసీల ఇళ్లకు ప్రభుత్వం అదనంగా ఆర్థిక సాయం అందజేస్తుందని తెలిపారు. స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా 2029 నాటికి అందరికీ ఇళ్లు ఉండాలనే లక్ష్యంతో యూనిట్‌కు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి శాంతి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో బంగారు ఆభరణాలు స్వాధీనం

నాయుడుపేట టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో 2.4 సవర్ల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. పట్టణంలోని అగ్రహారపేటలో నివాసం ఉంటున్న మాధవి తన ఇంట్లో నగలు చోరీకి గురైనట్లు ఫిబ్రవరిలో ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు స్థానికంగా ఓ మహిళను విచారించగా నగలు చోరీ చేసి కుదవపెట్టినట్లు తేలింది. బుధవారం నగలు స్వాధీనం చేసుకొని నిందితురాలిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచినట్లు సీఐ తెలిపారు.

విషపురుగు కాటుతో బాలుడి మృతి

తడ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విషపురుగు కాటుతో బాలుడు మృతి చెందాడు. మండల పరిధిలోని వేనాడు మూల గ్రామానికి చెందిన మల్లు తేజేష్(7) ఆదివారం రాత్రి ఇంటి వద్ద ఆరుబయట నిద్రిస్తుండగా విషపురుగు కాటేసింది. వెంటనే తల్లిదండ్రులు ఆ బాలుడిని సూళ్లూరుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం చెన్నైలోని చైల్డ్ ట్రస్టు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అళఘునాథస్వామికి లక్షతులసీ పూజ


స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గూడూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక అళఘునాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామి, అమ్మవార్లకు సామూహిక లక్షతులసీపూజ చేశారు. భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు.


లోకోస్ యాప్‌పై వీవోలకు శిక్షణ


మహిళలకు లోకోస్ యాప్‌పై శిక్షణ ఇస్తున్న ఏపీవో గున్నయ్య

చిట్టమూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల పనితీరును పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోకోస్ యాప్ వినియోగంపై చిట్టమూరు స్త్రీశక్తి భవనంలో రెండు రోజుల పాటు వీవోలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీవో గున్నయ్య మాట్లాడుతూ లోకోస్ యాప్ ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యుల పొదుపు, రుణాలు, ఇతర ఆర్థిక పథకాల ప్రయోజనాలు సులభతరం అవుతాయన్నారు. పొదుపు సంఘాలకు సంబంధించిన నిర్దిష్టమైన వివరాలను లోకోస్ యాప్‌లో నమోదు చేయాలని వీవోలకు వివరించారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

సూళ్లూరుపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం వేముగుంటపాలెం గ్రామానికి చెందిన శ్రీరాంసుబ్బయ్యకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.లక్ష 14 వేలు చెక్కును టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి బుధవారం అందజేశారు. నాయకులు వేనాటి జనార్దనరెడ్డి, కేవీరెడ్డి, బాబురెడ్డి, కామిరెడ్డి అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న వేనాటి సతీష్ రెడ్డి, జనార్దనరెడ్డి, అశోక్ రెడ్డి, కేవీ రెడ్డి తదితరులు

ఓజిలి - కురుగొండ రోడ్డును బాగు చేయండి


అధ్వానంగా ఉన్న ఓజిలి - కురుగొండ రహదారి

ఓజిలి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఓజిలి - కురుగొండ రహదారి అధ్వానంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో భారీ వాహనాలతో ఇసుక, గ్రావెల్, మట్టి తరలిస్తుండడంతో బాగా దెబ్బతింది. ఆర్అండ్‌బీ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నా రోజుల వ్యవధిలోనే మళ్లీ యథాతథస్థితికి చేరుకుంటోంది. ఏడు కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డులో గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. గోతులను తప్పించే ప్రయత్నంలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవతున్నాయి. ప్రధానంగా ఓజిలికి సమీపంలోని పొలాల వద్ద, బత్తలాపురం, మానమాల, కురుగొండ సబ్‌స్టేషన్ వద్ద రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ఓజిలి - కురుగొండ రహదారిని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా గోతులు


చెంగాళమ్మ మాను సమీపంలో రహదారిపై గుంత

చిట్టమూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మల్లాం ప్రధాన రహదారిపై పెద్దపెద్ద గోతులు పడి ప్రమాదకరంగా ఉన్నాయి. యాకసిరి చెంగాళమ్మ మాను సమీపంలోని తెలుగుగంగ కల్వర్టు వద్ద పెద్ద గొయ్యి ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. అదేవిధంగా కొత్తగుంట కట్టెలదొడ్డి వద్ద రోడ్డు మధ్యలో పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయి. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులకు గుంతలు కనిపించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి నాయుడుపేట - మల్లాం ప్రధాన రహదారిపై గుంతలను పూడ్చి ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఉంది.

ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తే చర్యలు


దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

గూడూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను విక్రయించినా, వినియోగించినా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద దుకాణ దారులకు ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులను నిషేధించడం జరిగిందన్నారు. ప్లాస్టిక్ కవర్ల వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రజలు సహకరించాలని కోరారు. అలాగే పలు ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలను తనిఖీ చేశారు. రసాయన రంగులు కలిపిన మాంసం, కల్తీ ఆహర పదార్థాలను విక్రయిస్తే చర్యలు తీసకుంటామని హెచ్చరించారు.

చర్లపల్లి - కన్యాకుమారి మధ్య 26 ప్రత్యేక రైళ్లు

తినుపతి(సెంట్రల్) మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని చర్లపల్లి-కన్యాకుమారి మధ్య 26 ప్రత్యేక రైళ్ల ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. ఏప్రిల్ 2న చర్లపల్లిలో ఈ ప్రత్యేక రైలు(07230) రాత్రి 9.50 గంటలకు బయలుదేరి నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట, తిరుత్తణి, కాట్పాడి, తిరువణ్ణామలై, విల్లుపురం, తిరుప్పాదిరి పులియూర్, చిదంబరం, మైలాడుదురై, కుంభకోణం, తిరువారూర్, తిరుచ్చి, దిండిగల్లు, కొడైకెనాల్ రోడ్డు, మధురై, విరుదునగర్, సతూర్, కోవిల్‌పట్టి, తిరునల్వేలి, వల్లియూర్, నాగర్‌కోయిల్ మీదుగా కన్యాకుమారిలకు రెండవ రోజు రాత్రి 2.30 గంటలకు చేరుకుంటుంది. కన్యాకుమారిలో ఈ ప్రత్యేక రైలు(07229) ఏప్రిల్ 4న ఉదయం 5.15 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయా ణిస్తూ మరుసటి రోజు ఉదయం 11.40 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుందని వెల్లడించారు. ఈ ప్రత్యేక రైళ్లు జూన్ 27వ తేదీ వరకు చర్లపల్లిలో ప్రతి బుధవారం, కన్యాకుమారిలో ప్రతి శుక్రవారం బయలు దేరి రాకపోకలు సాగిస్తా యని రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.

జూన్ 30 వరకు ప్రత్యేక రైళ్ల పొడిగింపు

వేసవిని దృష్టిలో ఉంచుకుని ఆరు ప్రత్యేక రైళ్లను ఏప్రిల్ 4 నుంచి జూన్ 30వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. తిరుపతి-అకోల-పూర్ణ-వికారాబాద్‌ల మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్ల రాకపోకల కాలాన్ని పొడిగించామని పేర్కొన్నారు. తిరుపతి - అకోల (07605-07606), తిరుపతి-పూర్ణ(07610-07609), తిరుపతి - వికారాబాద్ (07481-07482) మధ్య రాకపోకలు సాగిస్తాయని వివరించారు.

రాస్ ఆధ్వర్యంలో క్యాన్సర్ వైద్యశిబిరం


వైద్యపరీక్షలకు హాజరైన మహిళలు

శ్రీకాళహస్తి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ రాస్ క్లస్టర్ కార్యాలయంలో బుధవారం రాస్, టాటా ట్రస్టు క్యాన్సర్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో క్యాన్సర్ వైద్య ఉచిత శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్లు దేవకి, సుచిత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పని ఒత్తిడి, యాంత్రిక జీవనంతో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఇక తమ బ్యాంకులో జీవన సంవృద్ధి ఖాతా తెరుచుకుని రూ.15వేలు నిల్వ ఉంచుకుంటే క్యాన్సర్‌కు రూ.10లక్షలు, ప్రమాదానికి రూ.5లక్షలు వరకు ఉచిత బీమా ఉంటుందన్నారు. ఇది కేవలం మహిళలకు మాత్రమే అని చెప్పారు. టాటా ట్రస్టు ప్రోగ్రాం మేనేజరు హేమంత్ కుమార్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. బీపీ, మధుమేహం, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను నిర్వహించారు. టాటా ట్రస్టు డాక్టర్ వెంకయ్యబాబు, రెడ్డికుమారి, వినీత, మహేంద్ర, రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేష్, పొదుపుసంఘాల సభ్యులు, లీడర్లు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

25న ప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణం

వడమాలపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 25వ తేదీ శ్రీవారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి శివకుమార్ తెలిపారు. ప్రతి నెలా శ్రవణా నక్షత్రం రోజున స్వామి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం ఉదయం 10.30 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొనదలచిన భక్తులు రూ.300 చెల్లించాల్సి ఉంటుందన్నారు. గృహస్థులకు ఉత్తరీయం, రవికె, అప్పం, తీర్థప్రసాదాలు బహుమానంగా అందిస్తారు. కల్యాణోత్సవంలో పాల్గొనే దంపతులు సంప్రదాయ దుస్తులతో హాజరుకావాల్సి ఉంది.

గ్రామంలోనే ఇళ్ల స్థలాలు కేటాయించండి


నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహన్

పుత్తూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పరమేశ్వర మంగళం వద్ద జాతీయ రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న దళితులు ప్రత్యామ్నాయ స్థలాలు చూపనిదే ఖాళీ చేయమని భీష్మించారు. దీంతో తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ బుధవారం క్షేత్రస్థాయి పరిశీలించి 24 మంది బాధితులకు నచ్చచెప్పారు. తమకు పరమేశ్వర మంగళంలోనే ఇళ్ల స్థలాలు కావాలని, కృష్ణసముద్రం వద్ద కేటాయిస్తే వెళ్లమని తెగేసి చెప్పారు. దీంతో నిర్వాసితుల డిమాండ్ మేరకు గ్రామ పరిధిలోనే స్థలాలను కేటాయించాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లును ఆయన ఆదేశించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న రీసర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిశీలించారు. డీటీలు అశోక్‌రెడ్డి, గురుస్వామి పాల్గొన్నారు.

ప్రమాదంలో మరణించిన విద్యార్థి కుటుంబానికి సాయం



పుత్తూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతూ రైలు ఢీకొని మరణించిన బాలాజి తండ్రి వీరయ్యకు బుధవారం కాలేజీ ఆధ్వర్యంలో రూ. 22 వేలను అందించారు. పేదరికంలో ఉండీ బిడ్డను కోల్పోయిన విద్యార్థి కుటుంబానికి తమ వంతు సాయంగా విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది విరాళాలను పోగుచేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

పన్ను బకాయిలు చెల్లించండి


పన్ను బకాయిలు వసూలు చేస్తున్న కమిషనర్

పుత్తూరు అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో పన్ను బకాయిలను సకాలంలో చెల్లించాలని కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం బకాయిదారుల వద్దకు కమిషనర్ సిబ్బందితో కలిసి నేరుగా వెళ్లారు. పెండింగ్ పన్నులు చెల్లించాలని కోరారు. కమిషనర్ వెంట రెవెన్యూ అధికారి పెంచలయ్య, రవికాంత్ ఉన్నారు. ఆస్తి పన్ను, కొళాయి పన్ను, ఖాళీ స్థల పన్నులు ఎక్కువ మొత్తంలో పెండింగ్‌లో ఉన్న వారందరీ వద్దకు వెళ్లారు. కమిషనర్ రాకతో పలువురు బకాయిదారులు స్పందించి అప్పటికప్పుడే పన్నులు చెల్లించారు. మరికొందరు చెక్కులు అందజేశారు. పన్నులు చెల్లించని వారికి కొళాయి కనెక్షన్‌లు తొలగిస్తామని ఈ సందర్భంగా కమిషనర్ హెచ్చరించారు. అప్పటికీ చెల్లించకపోతే జప్తు చేస్తామన్నారు. నూరు శాతం పన్నులు చెల్లింపులు జరిగితేనా ప్రభుత్వం నుంచి అభివృద్ధి పనులకు నిధులు మంజూరవుతాయని చెప్పారు. పన్నులు చెల్లించేందుకు సెలవు రోజుల్లో కూడా సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు



పుత్తూరు అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీలు సాగుతున్న విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో మంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి మొక్కను అందజేసి శాలువతో సత్కరించారు.

భూ సమస్యలను పరిష్కరించండి: సీపీఎం


ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

పుత్తూరు టౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో భూ సమస్యలను పరిష్కరించాలంటూ ఆర్డీవో రామ్మోహన్‌కు పుత్తూరు సీపీఎం నాయకుడు ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ... తొరూరు సర్వే నెం.27లో ఐదుగురు గోపాలకృష్ణాపురం యానాదులు 40 యేళ్లుగా రెండు ఎకరాలను సాగు చేసుకుంటున్నారని చెప్పారు. అయితే పుత్తూరుకు చెందిన ఒకరు పాసు పుస్తకాలను ఆయన చేతిలో పెట్టుకుని పేదలను ఇబ్బంది పెడుతున్నాడన్నారు. అలాగే గాలేరు నగరి ప్రాజెక్టులో నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వాలని కోరారు. ఎగువ గూళూరు శ్మశానం సర్వే చేయాలని, బొజ్జనెత్తం ఎస్టీ కాలనీ, ఒంటిమిట్ట ఎస్టీ కాలనీల్లో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని వినతి పత్రం అందజేశారు. సీపీఎం నాయకులు సుబ్రమణ్యం, నందయ్య పాల్గొన్నారు.

మురుగు గుంతను పూడ్చండి

పుత్తూరు టౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ రెండో వార్డు పరిధిలో ఉన్న తిమ్మాపురం ప్రజలను మురుగు నీటి గుంత నుంచి కాపాడాలని సీపీఎం నాయకులు కోరారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా తిమ్మాపురంలో సీపీఎం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు వెంకటేష్ మాట్లాడుతూ తిమ్మాపురంలో మురుగునీటి గుంత సమస్య పరిష్కరించాలని రెండేళ్లుగా కలెక్టర్, పుత్తూరు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాలు అందించినా ఇప్పటి వరకు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగునీటి గుంత సమస్యను పరిష్కరించాలని కోరారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

మహాలక్ష్మమ్మకు బంగారు కాసుల వితరణ

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుత్తేరిలో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మమ్మ ఆలయంలో అమ్మవారికి గ్రామానికి చెందిన మధు, ధీరజ్ రూ.20 వేల విలువైన బంగారు కాసులను బుధవారం వితరణ చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి కాసులను అలంకరించారు.

బాలికల ప్రాధాన్యంపై అవగాహన


అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో లింగ నిష్పత్తి తక్కువగా ఉందని, ఈ ప్రాంతాల్లో బాలికల ప్రాధాన్యంపై అవగాహన కల్పించడం ద్వారా పుట్టబోయే బాలికల శాతాన్ని మెరుగుపరచాలని ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి చెప్పారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఆర్డీవో ఆధ్వర్యంలో పీసీ పీఎన్డీటీ (గర్భస్థ లింగ నిర్ధరణ చట్టం) అమలుపై ఉప జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ, ఉప జిల్లా సలహా కమిటీ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లింగ నిష్పత్తిలో అసమానతలను తగ్గించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా డెకాయ్ ఆపరేషన్లు, తనిఖీలు కఠినంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధరణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎంహెచ్‌వో అనుమతి తీసుకున్న తరువాతే స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రులు, నర్సింగ్‌హోంలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి డిప్యూటీ డీఎంహెచ్‌వో మృదులవాణి, ఏరియా ఆస్పత్రి వైద్యులు మధు, కిరణ్ కుమార్, సీడీపీవో శాంతిదుర్గ, లీగల్ అడ్వైజర్ ఇంద్రాణి, ఎన్జీవోలు, కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

మృత్యువుతో పోరాడి ఓడిన అంగన్‌వాడీ కార్యకర్త


శ్రీవాణి (ఫైల్‌ఫొటో)

పిచ్చాటూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు అంగన్‌వాడీ కార్యకర్త శ్రీవాణి మృత్యువుతో పోరాడి బుధవారం కన్ను మూశారు. ఈనెల 10న అంగన్‌వాడీల రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు విజయవాడలో ధర్నాకు వెళ్లిన శ్రీవాణి బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆస్పత్రి పాలైన విషయం విదితమే. విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను తిరుపతి స్విమ్స్‌కు తరలించి చికిత్సలం దించారు. పది రోజులుగా శ్రీవాణి శరీరం వైద్యానికి స్పందించడం లేదని వైద్యులు తెలిపారు. ఈక్రమంలో ఈనెల 19న బుధ వారం ఆమె తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా శ్రీవాణి మృతి పట్ల ఎమ్మెల్యే ఆది మూలం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వపరంగా ఆమె కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పారు. శ్రీవాణి భర్త లక్ష్మీపతిరాజుతో పాటు ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. కాగా శ్రీవాణి ఉన్న చుట్టు పక్కల గ్రామాల్లో చిన్న పిల్లలకు రాత్రి వేళల్లో పండరి భజన నేర్పేవారు.

పోటాపోటీగా వేలం పంచాయతీకి ఆదాయం

వరదయ్యపాళెం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో బుధవారం వేలం పోటాపోటీగా జరిగింది. పంచాయతీ గదులు, కూరగాయల మార్కెట్, బస్టాండు, జంతు వధశాలకు ఈవో బసిరెడ్డి, సర్పంచ్ జ్యోతి ఆధ్వర్యంలో వేలం వేశారు. సూళ్లూరుపేట డీఎల్‌పీవో రవీంద్ర బాబు పర్యవేక్షించారు. ఈ వేలం ద్వారా రూ.15.55 లక్షల ఆదాయం వచ్చింది. నెం. 2, 3, 4, 11, 20, 21, 23, 25 పంచాయతీ గదుల వేలానికి ఎవరూ ఆసక్తి చూపలేదు. దీంతో ఈనెల 21న మరోసారి వేలం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చంద్రబాబు, మాజీ సర్పంచ్ తిలక్, టీడీపీ నాయకులు నిర్మల్, మునిభూషణమ్మ, వినోద్‌యాదవ్, రాష్ట్ర కాపునాడు కన్వీనర్ విజయకుమార్, బీజేపీ నాయకుడు గుత్తి త్యాగరాజు పాల్గొన్నారు. కాగా గత ఏడాది వేలం ద్వారా రూ. 11.53లక్షలు ఆదాయం వచ్చింది.

మాలల సింహగర్జనను జయప్రదం చేయండి

వరదయ్యపాళెం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 23న జరిగే రాయలసీమ మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని దళిత ఐక్యవేదిక నియోజకవర్గ అధ్యక్షుడు చింతల శంకర్ పిలుపునిచ్చారు. బస్టాండు వద్ద బుధవారం సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణయ్య, మాజీ సర్పంచ్ బాబు, మాల మహానాడు కన్వీనర్ అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి


గృహ నిర్మాణ వ్యర్థాలు పేరుకుపోవడంతో కదలని మురుగు

శ్రీకాళహస్తి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మురుగు కాలువలు స్తంభించిపోవడంతో తమ వీధిలో వ్యాధులు విజృంభిస్తున్నాయని పురపాలకసంఘ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ పురపాలకసంఘ కార్యాలయం ఎదురుగా భవనం నిర్మిస్తున్న యజమాని సదరు వ్యర్థాలను కొద్దినెలలుగా కాలువలో వేయడంతో మురుగు స్తంభించి పోయిందని వాపోయారు. ఇలా దీర్ఘకాలికంగా మురుగు నిల్వ చేరిపోవడంతో తమ వీధి మొత్తం జ్వరాలు విజృంభిస్తున్నాయని.. పిల్లలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని వివరించారు. అధికారులు స్పందించి కాలువలో వ్యర్థాలను తొలగించి మురుగు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డుకు అడ్డంగా గడ్డివాము తొలగించాలని గిరిజనుల వినతి


రోడ్డుకు మధ్యలో గడ్డివాము - రెవెన్యూ అధికారికి అసిస్టెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుత్తేరి గిరిజన కాలనీలో వీధికి అడ్డంగా వేసిన గడ్డివామును తొలగించాలని గిరిజనులు ఆర్ఐ నల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ... గ్రామానికి చెందిన సుబ్బరామయ్య తమ కాలనీకి వచ్చే రోడ్డు మధ్యలో గడ్డివాము వేయడంతో రాకపోకలు నిలిచిపోయినట్లు తెలిపారు. గడ్డివామును తొలగించాలని సుబ్బరామయ్యను కోరగా తమపై దౌర్జన్యం చేస్తున్నాడని తెలిపారు. వారం రోజులు నుంచి గడ్డివామిని తొలగించాలని వీఆర్‌ఓకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. స్పందించిన ఆర్ఐ తహసీల్దార్‌కు సమచారం తెలియజేసి గడ్డివామిని తొలగిస్తామని గిరిజనులకు తెలిపారు.

కూనాటి సురేష్‌కు గురుబ్రహ్మ అవార్డు


సురేష్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

శ్రీకాళహస్తి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు కూనాటి సురేష్‌కు మరో అరుదైన గౌరవం దక్కింది. విశాఖపట్నానికి చెందిన సెయింట్ మదర్ థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు 2024 సంవత్సరానికి కూనాటి సురేష్‌ను రాష్ట్రస్థాయి గురుబ్రహ్మ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ అవార్డును విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో సురేష్ అందుకోవాల్సి ఉంది. అయితే కార్యక్రమానికి వెళ్లలేని కారణంగా అవార్డును పాఠశాలకు పోస్టు ద్వారా నిర్వాహకులు పంపారు. బుధవారం ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

చట్టప్రకారం పరిష్కరిస్తాం: ఆర్డీవో


సదాశివపురంలో వివాదాస్పద భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో

కేవీబీపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): భూ వివాదాలను చట్టప్రకారం పరిష్కరిస్తామని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి చెప్పారు. బుధవారం ఆయన మండలంలోని రాజులకండ్రిగ, కేవీబీపురం, సదాశివపురంలలో రాజులకండ్రిగ సర్వే నెం.254లో ఎస్టీల అధీనంలో ఉన్న 15 ఎకరాలను పరిశీలించారు. వీటికి అర్హత ఉంటే న్యాయం చేస్తామని ఈ లోపు గొడవలు పడవద్దని సూచించారు. దీంతో పాటు కేవీబీపురంలో వివాదంలో ఉన్న ఇంటి స్థలం అడంగల్ తదితరాలను పరిశీలించిన తరువాత పట్టా మంజూరు చేస్తామని చెప్పారు. సదాశివపురంలో సర్వే నెం.423/1లో ఉన్న పొలాన్ని త్వరలోనే సర్వే చేయిస్తామని చెప్పారు. తహసీల్దారు మునిరత్నంరెడ్డి, మండల సర్వేయర్ సురేష్, వీఆర్వో మునిబాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

స్టెమ్‌ల్యాబ్ ప్రారంభం



స్టెమ్‌ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న రమణ, రమేష్ తదితరులు

శ్రీకాళహస్తి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చివోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో క్రై సంస్థ సహకారంతో స్టెమ్‌ల్యాబ్‌ను బుధవారం ప్రారంభించారు. విద్యార్థుల్లో సైన్స్, సాంకేతికత, ఇంజనీరింగ్, గణితం పట్ల ఆసక్తి పెంచడమే లక్ష్యంగా దీన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ మాట్లాడుతూ... ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా అధికంగా ఉన్నారన్నారు. విద్యలో వీరి పిల్లలు వెనుకబడి ఉన్నారని తెలిపారు. విద్య పట్ల ఆసక్తి పెంచడం కోసం ఒక్కో పాఠశాలకు రూ.7లక్షల విలువైన స్టెమ్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ల్యాబ్‌లోని విశేషాలను వివరించారు. దీని వలన బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంఈవో భువనేశ్వరి స్టెమ్ ల్యాబ్ ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్ బాబు, ప్రగతి సంస్థ సభ్యులు ప్రభాకర్, జయలక్ష్మి, శిరీష, బోస్, జయచంద్ర, సురేష్, రాజేశ్వరి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయంతో భక్తులకు ప్యూరిఫైడ్ వాటర్


వాటర్‌ప్లాంట్‌కు పూజలు

శ్రీకాళహస్తి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పానగల్‌లో కొలువై ఉన్న పొన్నాలమ్మ ఆలయానికి వచ్చే భక్తుల కోసం దాతల సాయంతో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు మాట్లాడుతూ భక్తుల కోసం రక్షిత మంచినీటిని అందించేందుకు దాతల సాయం కోరామన్నారు. అందుకు మురళికృష్ణారెడ్డి దంపతులు, గోపీనాథ్‌రెడ్డి దంపతులు, పోలి మునిరామయ్య, రవి తదితరులు ప్లాంట్ ఏర్పాటుకు ఆర్థిక సాయం అందజేశారన్నారు. దాతల చేతుల మీదుగా వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి

వరదయ్యపాళెం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకానికి టెన్త్ ఆపై చదివిన యువత దరఖాస్తు చేసుకోవాలని బీజేపీ వరదయ్యపాళెం మండల అధ్యక్షుడు దిలీప్‌రాయల్ కోరారు. అర్హులైన వారికి ఏడాది పాటు నెలకు రూ.5వేలు చొప్పున, మొదటినెల రూ.6వేలు సాయం అందిస్తుందన్నారు. ఈ ప్రక్రియ ఈనెల 30న ముగిస్తుందని తెలిపారు. వివరాలకు నెం.9494428669లో సంప్రదించాలన్నారు.

బహిరంగ మద్యపానంపై చర్యలు


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బహిరంగ మద్యం తాగితే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపి అన్నారు. పట్టణంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బహిరంగ మద్యపానంపై హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. పరిసరాలను స్థానికులతో కలిసి శుభ్రం చేశారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ మద్యపానం కారణంగా శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడుతుందని తెలిపారు.